

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 01 | సంచిక: 211 | హైదరాబాద్ | శనివారం | 22-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## జనం కోసమే జాగృతి

**మహేశ్వరంలో సబిత అనుచరులు చెరువులను కబ్జా చేస్తున్నారని ఆరోపణ**

కబ్జాలపై సబిత స్పందించకపోవడం దారుణమన్న కవిత

హైడ్రా కూడా కబ్జాలను పట్టించుకోవడం లేదని ఆరోపణ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసిందని వ్యాఖ్య

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**



జనం కోసమే జాగృతి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనం బాట నిర్వహిస్తున్నట్లు జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత శుక్రవారం ఎల్బీనగర్ లోని ఓ హోటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్,

..మిగతా 2లో

## కేటీఆర్‌కు పచ్చకామెర్లు సోకాయి



రేవంత్ కుటుంబాన్ని కేటీఆర్ విమర్శించడంపై చామల ఆగ్రహం

బీఆర్ఎస్ హయాంలో సాగింది ఫాం హౌస్ పాలనేనని ఆరోపణ

ఎన్నికల్లో ఓడినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదని విమర్శ

02



# నన్ను అరెస్ట్ చేసే దమ్ము లేదు

ఈ కార్ రేసు అంతా ఫేక్

ఈ కేసులో ఏమీ లేదు

కక్షసాధింపుకోసమే తప్పుడు ఆరోపణలు

రేవంత్ పాలనలో భారీ భూకుంభకోణం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ఫార్ములా, ఈ కార్ కేసులో తనపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైందని, ప్రభుత్వం తనను అరెస్టు చేసే ధైర్యం చేయదని స్పష్టం చేశారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. 'ఈ కేసులో ఏమీ లేదని అందరికీ తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదు. వందసార్లు చెప్పాను... ఫార్ములా-ఈ కేసులో ఎలాంటి తప్పూ చేయలేదు'' అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ ''జాయింట్ వెంచర్

..మిగతా 2లో



### సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

లక్డీకాపూల్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరైన సినీతారలు

బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వారిని విచారిస్తున్న సీఐడీ

జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి

02



### నిఖత్ జరీన్‌కు స్వర్ణం.. సీఎం రేవంత్, కేటీఆర్ అభినందనలు

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నిఖత్ జరీన్‌కు స్వర్ణ పతకం

గ్రేటర్ నోయిడాలో జరిగిన 51 కేజీల విభాగంలో విజయం

అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, వెంకయ్య నాయుడు

నిఖత్ విజయంపై కేటీఆర్, కవిత ప్రశంసల వర్షం

02

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

ప్రొటోకాల్‌కు భిన్నంగా దర్శనం



02

## హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

మావోయిస్టు కేంద్ర కమిటీ సంచలన లేఖ

విజయవాడలో అరెస్ట్ చేసిన తర్వాత కాల్చి చంపారు

ప్రభుత్వ దమనకాండకు ఈ ఘటన నిదర్శనమన్న మావోయిస్టు పార్టీ



03

## పగలే చుక్కలు కనిపిస్తున్నాయా?

ఆర్థిక అరాచకానికి పాల్పడిన గత ప్రభుత్వం

ఇండస్ట్రియల్ పాలసీ పై దుష్ప్రచారం

ఆయన ఆలోచనలో మార్పు రావడం లేదు

ఇండస్ట్రియల్ పాలసీపై అవస్తవాలు

కన్వర్షన్ కు,భూమికి లింక్ పెట్టి రాజకీయం

కేటీఆర్ పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం

గ్లోబల్ సిటీని అడ్డుకోవాలని బీఆర్ఎస్ చూస్తుంది..



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వానికి పాల్పడి వెళ్లి పోతే రెండేళ్లుగా దానిని సరిదిద్దుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, అయినా కేటీఆర్ ఆలోచనలో మార్పు రావడం లేదని

..మిగతా 3లో

### తెలంగాణలో భారీగా ఐపీఎస్ బదిలీలు

32 మంది సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

స్థానిక ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం?

02



## ఐబొమ్మ రవిపై ఐదు కేసులు

బెట్టింగ్‌యాప్ ప్రమోషన్ చేసినందుకు చర్యలు


రవికి సహకరించింది ఎవరు?

ఈ దందా వెనుక అంతర్జాతీయ ముఠా ఉందా?

త్వరలో మరికొన్ని అరెస్టులు







**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

సినిమాల పైరసీ కేసుల్లో కీలక నిందితుడిగా భావిస్తున్న ఐబొమ్మ రవిపై పోలీసులు మొత్తం ఐదు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తాజాగా పైరసీ సెల్ అధికారికంగా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఒక కొత్త కేసు నమోదు కాగా, ఇప్పటికే నమోదైన పలు కేసుల్లో కూడా అతడి పాత్ర ఉన్నదనే అనుమానాలపై దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. పైరసీ చేసిన సినిమాలను వివిధ వెబ్‌సైట్లకు, టెలిగ్రామ్ ఛానెళ్లకు పంపిణీ చేసినట్లు ఆరోపణలు రావడంతో, ప్రస్తుతం రవిని పోలీసులు అరెస్టు చేసి సుదీర్ఘంగా విచారిస్తున్నారు.

**బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌పై మరో కేసు**

సినిమాల పైరసీకి మాత్రమే కాకుండా, అక్రమంగా పనిచేసే ఒక బెట్టింగ్ యాప్ ప్రమోషనల్ కంటెంట్‌ను రూపొందించి ప్రచారం చేసిన ఘటనలో కూడా రవిపై మరో కేసు నమోదు అయింది. ఈ విషయంలో కూడా అతడికి ఎవరెవరు సహకరించారు? ప్రమోషన్ ఎటువంటి ఒప్పందాల ద్వారా చేపట్టాడన్న అంశాలపై అధికారులు

..మిగతా 3లో

## మిస్ యూనివర్స్ 2025 మెక్సికో సుందరి ఫాతిమా బాష్


థాయ్‌లాండ్ వేదికగా అందాల పోటీలు

120 దేశాల నుంచి పాల్గొన్న పోటీదారులు

**నేషనల్ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో భారీ హంగులతో నిర్వహించిన మిస్ యూనివర్స్-2025 ప్రపంచ అందాల పోటీల్లో మెక్సికోకు చెందిన 25 ఏళ్ల సుందరి ఫాతిమా బాష్ విశ్వసుందరిగా ఎంపికై సత్తా చాటారు. వివిధ దశల్లో జరిగిన కఠినమైన పోటీల్లో ఆమె ప్రతిభ, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం న్యాయనిర్ణేతలను ఆకట్టుకోవడంతో ఈ ఏడాది ప్రపంచ అందాల కిరీటాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది విజేతగా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్ ఫాతిమాకు కిరీటాన్ని తొడిగి అభినందించారు. ఈ సందర్భంగా హాల్లో హర్షధ్వానాలు

..మిగతా 2లో



# జనం కోసమే జాగృతి

మొదటిపేజీ తరువాయి



కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో విధ్వంసానికి పాల్పడ్డాయన్నారు. తెలంగాణ కొందరిది అయిందని, తెలంగాణ ప్రజలందరికీ చెందాలన్నారు. 19 సంవత్సరాలుగా తెలంగాణ జాగృతి ప్రజల మధ్య ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఉండాలని, తెలంగాణ వీరుల పాఠాలను స్కూల్ బుక్స్ ల్లో చేర్చడానికి తెలంగాణ జాగృతి కొట్లాడిందని గుర్తు చేశారు.
తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మానవ వనరుల అభివృద్ధి పేరుతో స్కిల్స్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసిన సంస్థ తెలంగాణ జాగృతి అని, దీనివల్ల వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ల గురించి జాతీయస్థాయిలో కొట్లాడిన సంస్థ తెలంగాణ జాగృతి అన్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకోపోవడానికి జాగృతి పనిచేస్తుందని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి జనం బాట ముఖ్య ఉద్దేశం ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం వద్దకు తీసుకు వెళ్ళడమేనని చెప్పారు. రంగారెడ్డి జిల్లా పేరుకే పెద్ద కానీ క్షేత్రస్థాయిలో సరైన ఫలితాలు ప్రజలకు అందలేదని, జిల్లాలో ఉన్న జిల్లాలో ఉన్న వాళ్ళకి ఎలాంటి లాభం అందలేదన్నారు. ఫ్యాక్టరీల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, దీని గురించి జాగృతి కొట్లాడుతుందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 64 చెరువులు ఉండగా, అందులో సుమారు 10 నుంచి 12 శాతం చెరువులు కబ్జాకు గురి అయ్యాయని ఆరోపించారు. హైడ్రా ముసుగులో పేదవాళ్లని విల్లగొట్టడం మాత్రమే ప్రభుత్వ పని అని విమర్శించారు. చెరువుల కబ్జాపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ట్రిబుల్ ఆర్ బాధిత రైతులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వద్దకు తీసుకెళ్లి రీ సర్వే చేయాలని కోరుతామని, వీలైతే అలైన్మెంట్ మార్పుపై కోర్టు కూడా వెళతామని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గం లో రావిర్యాల చెరువు మంత్రాల చెరువును సబితా ఇంద్రారెడ్డి అనుచ్యా కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ విషయంపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎల్బీనగర్ లో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. భూదాన్ భూములపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి భూములను కాపాడాలన్నారు. ఫార్మాసిటీ నిర్మించకపోతే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు పచ్చకామెర్లు సోకాయి

- **రేవంత్ కుటుంబాన్ని కేటీఆర్ విమర్శించడంపై చామల ఆగ్రహం**
- **బీఆర్ఎస్ హయాంలో సాగింది ఫాం హౌస్ పాలనేనని ఆరోపణ**
- **ఎన్నికల్లో ఓడినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదని విమర్శ**

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. ప్రస్తుతం కేటీఆర్ పరిస్థితి కూడా అలాగే ఉంది" అని ఆయన ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ తీరుపై ఈ మేరకు ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఫాం హౌస్ పాలన తప్ప, ప్రజల కోసం పాలన చేయలేదని కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబాన్ని నిందించడం తప్ప కేటీఆర్‌కు మరో మార్గం కనిపించడం లేదని విమర్శించారు. అసలు రేవంత్ రెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. "కేసీఆర్ కుటుంబంలో మాదిరి రేవంత్ రెడ్డి కుటుంబంలో ఎవరూ పదవుల్లో లేరు కదా?" అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలకు మంచి చేయలేదని, ఇప్పుడు తాము చేస్తుంటే అడ్డుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వ్యాపారవేత్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా కేటీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదని, ఆయన తీరు మారలేదని చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# నన్ను అరెస్ట్ చేసే దమ్ము లేదు

మొదటిపేజీ తరువాయి




ప్రభుత్వం'' నడుస్తోందని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే పరువు పోతుందని, అందుకే వారికి రాజీనామా చేయిస్తున్నారని ఆరోపించారు.
భూకుంభకోణంపై తీవ్ర ఆరోపణలు చేసిన కేటీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ భూ వ్యవహారాలకు తెరలేపిందని వ్యాఖ్యానించారు. అజమాబాద్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో భారీ అన్యాయం జరుగుతోందని, 9,292 ఎకరాల భూములను చౌకగా కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ''ఈ నిర్ణయం రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణానికి నాంది. కనీసం రూ.50 వేల కోట్ల ప్రయోజనం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు'' అని కేటీఆర్ అన్నారు. భూములు కొనుగోలు చేసే వారు కూడా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన ఆయన, భవిష్యత్‌లో BRS ప్రభుత్వం ఏర్పడితే బాధ్యులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. BRS హయాంలో ఇలాంటి క్రమబద్ధీకరణలు ఎప్పుడూ జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్ములా-ఈ కేసుతో మొదలైన వివాదం, కేటీఆర్ చేసిన తాజా ఆరోపణలతో మరింత తీవ్రరూపం దాల్చింది. తెలంగాణ రాజకీయాల్లో ఈ వ్యాఖ్యలు మరోసారి వేడిని పెంచాయి.

# నిఖత్ జరీన్‌కు స్వర్ణం..
## సీఎం రేవంత్, కేటీఆర్ అభినందనలు

- **ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నిఖత్ జరీన్‌కు స్వర్ణ పతకం**
- **గ్రేటర్ నోయిడాలో జరిగిన 51 కేజీల విభాగంలో విజయం**
- **అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, వెంకయ్య నాయుడు**

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

నిఖత్ విజయంపై కేటీఆర్, కవిత ప్రశంసల వర్షంభారత స్టార్ బాక్సర్, తెలంగాణ తేజం నిఖత్ జరీన్ మరోసారి ప్రపంచ వేదికపై సత్తా చాటారు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో ఆమె స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. 51 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా నిఖత్‌పై రాజకీయ, క్రీడా ప్రముఖుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నిఖత్ జరీన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై మరోసారి దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు. నిఖత్ అసాధారణ విజయం యువతకు, వర్ధమాన క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని సీఎం పేర్కొన్నారు. ఆమె భవిష్యత్ ప్రయత్నాల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, భారత బాక్సర్ల అపూర్వ విజయంతో దేశం గర్విస్తోందని అన్నారు. ముఖ్యంగా, తెలంగాణ బిడ్డ అయిన నిఖత్ జరీన్ తన అద్భుతమైన పంచ్‌లతో స్వర్ణం గెలవడంపై ప్రత్యేక అభినందనలు తెలిపారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కూడా నిఖత్‌ను ప్రశంసించారు. "నీ కఠోర శ్రమ, అలుపెరగని పట్టుదల భారత్‌కు, తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్నాయి. పెద్ద కలలు కనే ఎంతో మంది యువతులకు నువ్వు స్ఫూర్తి" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. నిఖత్ అంకితభావం ప్రతి విజయంలో కనిపిస్తోందని కవిత కొనియాడారు.



# సీఐడీ విచారణకు హాజరైన శ్రీముఖి, నిధి అగర్వాల్

- **లక్డీకాపూల్ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరైన సినీతారలు**
- **బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వారిని విచారిస్తున్న సీఐడీ**
- **జంగిల్ రమ్మీకి ప్రమోట్ చేసిన శ్రీముఖి**

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :



బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన వ్యవహారంలో ప్రముఖ సినీ తారలు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృతా చౌదరి సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేసిన ప్రముఖులను సీఐడీ అధికారులు వరుసగా విచారిస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల నటులు విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లను సీఐడీ అధికారులు విచారించారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని సీఐడీ వరుసగా విచారణకు పిలుస్తోంది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి వీరు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ యువత ప్రాణాలను బలిగొన్న నేపథ్యంలో, వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులపై కొన్ని నెలల క్రితం కేసు నమోదైంది. రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్ అంశంపై దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. శ్రీముఖి జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేయగా, అమృత చౌదరి పలు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేశారు.

# తెలంగాణలో భారీగా ఐపీఎస్ బదిలీలు

- **32 మంది సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా సౌలభ్యం, పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఈ మార్పులు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్‌లలో డీసీపీలు, జిల్లా ఎస్పీలు, సీఐడీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, టాస్క్‌ఫోర్స్ వంటి కీలక విభాగాల్లో కొత్త ముఖాలు కనిపించనున్నాయి.

**ముఖ్యమైన బదిలీలు**

సీఐడీ డీఐజీగా జె పరిమళ హన నూతన్ జాకబ్ (2009 బ్యాచ్) – ఇటీవలి వరకు హైదరాబాద్ జాయింట్ కమిషనర్ (అడ్మిన్)గా పనిచేసిన ఆమెకు ఈ కీలక బాధ్యత అప్పగించారు. ఏడీజీ (పర్సనల్)గా డిఎస్. చౌహాన్ కు పోస్టింగ్ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా డా ఎం చేతనను నియమించారు. మహేశ్వరం డీసీపీగా కె నారాయణ రెడ్డిని నియమించారు. ఆయన వికారాబాద్ ఎస్పీ నుంచి రిలీవ్ కానున్నారు. సౌత్ జోన్ డీసీపీ (హైదరాబాద్)గా కిరణ్ ఖరే ప్రభాకర్ ను అవకాశం ఇచ్చారు. ఆయన భూపాలపల్లి ఎస్పీ గా ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్, మల్కాజ్‌గిరి డీసీపీగా చెన్నూరి శ్రీధర్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజను నియమించారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి



ఏపీ బ్యూరో, సిద్దిపేట పవర్ :

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం పవిత్ర క్షేత్రమైన తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామివారి దర్శనాన్ని శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. ఉదయం తిరుమలకు చేరుకున్న వెంటనే రాష్ట్రపతి ముందుగా క్షేత్రాధిపతి శ్రీ వరాహస్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకున్న ఆమెకు మహాద్వారం వద్ద టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ అర్చకులు సాంప్రదాయ పూర్వకంగా స్వాగతం పలికారు.
ధ్వజస్తంభ ప్రదక్షిణ అనంతరం రాష్ట్రపతి ముర్ము శ్రీవారి అలయంలో జరిగిన సేవల్లో పాల్గొని, దేశ ప్రజల శాంతి, అభ్యుదయం కోసం ప్రార్థనలు చేశారు. తర్వాత రంగనాయకుల మండపంలో టీటీడీ వేదపండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం చేస్తూ విశేష ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ బీఆర్ నాయుడు రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, 2026 క్యాలెండర్, డైరీలను అందజేశారు. శ్రీవారి దర్శనం ముగించుకుని పద్మావతి అతిథి గృహానికి తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో అనూహ్యంగా ఓ ఘటన చోటుచేసుకుంది. రాంభగీచ బస్ స్టేషన్ ప్రాంతంలో రోడ్డు పక్కన నిల్చున్న భక్తులు రాష్ట్రపతి కాన్వాయ్‌ను గమనించి చేతులు ఊపుతున్నారు. వారి ఉత్సాహాన్ని చూసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా కాన్వాయ్‌ను ఆపించుకొని ప్రజలను పలకరించడానికి దిగారు. ఆ ప్రాంతంలో ఉన్న మహిళలు, చిన్నారులు, వృద్ధులతో రాష్ట్రపతి కొద్దిసేపు మమేకమయ్యారు. శుభాకాంక్షలు తెలిపిన భక్తుల చేతులు పట్టుకుని మాట్లాడారు. అనంతరం అక్కడ ఉన్న చిన్న పిల్లలకు స్వయంగా చాక్లెట్లు పంచిపెట్టిన రాష్ట్రపతి ముర్ము వినయం, భక్తులను అలరించింది. తిరుమలలో రాష్ట్రపతి ఈ విధంగా ప్రజలతో కలిసిన ఘటన అరుదైనదిగా నిలిచింది. ఆమె హృద్యమైన హావభావాలు, ప్రోటోకాల్ కంటే మానవీయతకు ప్రాధాన్యత ఇచ్చిన తీరు అక్కడి భక్తులలో విశేషమైన ఆనందాన్ని నింపింది.

# మిస్ యూనివర్స్ 2025
# మెక్సికో సుందరి ఫాతిమా బాష్

మొదటిపేజీ తరువాయి

మార్మోగాయి. తొలి ప్రయత్నంలోనే ప్రపంచం ముందుకి రావడం, ఒక్కసారిగా విజేతగా నిలవడం ఫాతిమా జీవన ప్రయాణంలో కీలక ఘట్టంగా నిలిచింది.

**120 దేశాల పోటీదారుల మధ్య మెక్సికో భామా మెరుపులు**

ఈ సారి ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల నుంచి పోటీదారులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ప్రిలిమినరీ, నేషనల్ కాస్ట్యూమ్, స్విమ్‌సూట్, ఈవెనింగ్ గౌన్, ఇంటర్వ్యూ, ఆన్‌స్టేజ్ ప్రశ్నల రౌండ్లు నిర్వహించగా ఫాతిమా ప్రతి దశలోనూ సమర్థతను ప్రదర్శించారు. చివరకు ముగ్గురు ఫైనలిస్టులలో మెక్సికో, థాయ్‌లాండ్, వెనెజువెలా దేశాల అందగత్తెల మధ్య జరిగిన పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఫస్ట్ రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, సెకండ్ రన్నరప్‌గా వెనెజువెలా నుంచి స్టిఫానీ అబాసలీ నిలిచారు. థాయ్‌లాండ్‌లోనే పోటీ జరిగిన నేపథ్యంలో స్థానిక ప్రేక్షకులు ప్రవీనర్ రన్నరప్‌గా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు.

**కష్టాలను అధిగమించిన ప్రేరణ గాథ**

మెక్సికోలోని శాంటియాగో డి తెపా ప్రాంతంలో జన్మించిన ఫాతిమా చిన్ననాటి నుంచే సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే, చదువుకునే రోజుల్లోనే ఆమెకు డిస్లెక్సియా, హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ వంటి సమస్యలు ఉన్నట్లు ఆమె గతంలో వెల్లడించారు. ఈ పరిస్థితులు ఆమె విద్యలో కొన్ని ఇబ్బందులను కలిగించినప్పటికీ వాటిని అధిగమించడానికి పెద్ద ఎత్తున కృషి చేశారు. తరువాత ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తూ మోడలింగ్, ఫ్యాషన్ రంగాలపై ఆసక్తి పెంచుకున్నారు. మెక్సికోలో వివిధ అందాల పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపును సాధించిన ఆమె, 2025లో జరిగిన *మిస్ యూనివర్స్ మెక్సికో* పోటీల్లో విజేతగా నిలిచి అంతర్జాతీయ వేదికకు ఎంపికయ్యారు.

**భారత్ ప్రాతినిధ్యం**

ఈ సంవత్సరం భారత్ తరపున రాజస్థాన్‌కు చెందిన మణికా విశ్వకర్మ** ప్రతినిధిగా పాల్గొన్నారు. ప్రారంభ రౌండ్లలో ఆమె అద్భుత ప్రతిభ చూపి టాప్ 30 వరకు చేరుకున్నారు. అయితే, కీలకమైన ఈవెనింగ్ గౌన్, ఇంటర్వ్యూ రౌండ్లలో పాయింట్లు తగ్గడంతో టాప్ 12లోకి నిలవలేక పోయారు. దీంతో భారత అభిమానులు నిరాశ వ్యక్తం చేశారు.

**విజేతకు దక్కే బహుమతులు**

మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ బహుమతి మొత్తాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా, అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం విజేతకు లభించేవి ఇలా ఉన్నాయి:

**$2,50,000 (దాదాపు ₹2 కోట్లు) నగదు బహుమతి**

**ప్రతి నెల $50,000 వేతనం**

**$5 మిలియన్ (దాదాపు ₹44 కోట్లు) విలువైన కిరీటం**

**న్యూయార్క్‌లో ఏడాది పాటు ఉచిత నివాస సౌకర్యం**

**పర్సనల్ టీమ్, మేకప్ ఆర్టిస్ట్, స్టైలిస్ట్, అసిస్టెంట్లు – మొత్తం ఉచితం**

**ప్రపంచవ్యాప్త పర్యటనకు సంబంధించిన ప్రయాణం, నివాసం, అతిథ్య ఖర్చులన్నీ సంస్థే భరిస్తుంది**

విజేత సంవత్సరం పాటు మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్‌కు *ప్రధాన అంబాసిడర్‌గా* పని చేయాల్సి ఉంటుంది. సామాజిక కార్యక్రమాలు, మహిళా సాధికారత ప్రాజెక్టులు, గ్లోబల్ ఫ్యాషన్ ఈవెంట్లు, ప్రెస్ కాన్ఫరెన్సులు వంటి అనేక బాధ్యతలు చేపట్టాలి.

**మెక్సికోలో సంబరాలు**



ఫాతిమా విజయం వార్త బయటకు రాగానే మెక్సికో దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు, అభిమానులు తమ ప్రాంతంలో ర్యాలీలు నిర్వహించారు. మీడియాతో మాట్లాడుతూ ఫాతిమా తల్లిదండ్రులు, "చిన్నప్పటి నుంచి ఎదుర్కొన్న కష్టాలను ఆమె ధైర్యంగా జయించింది. ఈ విజయం మా కుటుంబానికి గొప్ప గౌరవం" అని తెలిపారు.

**మెక్సికో మరో చరిత్ర**

మిస్ యూనివర్స్ పోటీల్లో ఇది మెక్సికో సాధించిన అరుదైన విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఫాతిమా బాష్ విజయం మెక్సికో యువతకు, అందాల పోటీలకు ఆసక్తి చూపే వారికి గొప్ప ప్రేరణగా నిలుస్తోంది.

## పగలే చుక్కలు కనిపిస్తున్నాయా?

మొదటిపేజీ తరువాయి



మంత్రి శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పారిశ్రామిక భూముల కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలని నిర్ణయిస్తే దానిని 5లక్షల కుంభకోణంగా చిత్రీకరిస్తూ కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ 'ఫ్రీహోల్డ్' రైట్స్ పేరిట 2023 ఆగస్టులో మూడు జీఓలు ఇచ్చిందని, వారి ప్రభుత్వ పాలనలో కాదా? అని ఆయన ప్రశ్నించారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియాలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ ఆరోపణలను ఆధారాలతో తిప్పికొట్టారు. కేటీఆర్ చెబుతున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించినది 4740 ఎకరాలేనని, మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించామన్నారు. ఈ కేటాయింపులు ఒక్కరోజులో చేసినవి కాదని, పరిశ్రమల అభివృద్ధి కోసం దశాబ్దాల కాలంగా ఇస్తూ వచ్చినవన్నారు. ఆజామాబాద్, కూకట్ పల్లి, హఫీజ్ పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించినది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. కూకట్ పల్లి, ఆజామాబాద్, హఫీజ్ పేట భూములకు సంబంధించి ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్టుమెంట్, జీఓ ఎంఎస్ 19, 20, 21 లను 2023 ఆగస్టు 29 న జారీ చేసిందన్నారు. ఇప్పుడు ఆ భూములకు కన్వర్షన్ అవకాశం కల్పిస్తున్నామని, 30, 50 శాతం స్లాబులతో ఇంపాక్టు ఫీజు నిర్ణయిస్తూ ఈనెల 17న జరిగిన కేబినెట్ లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారని, అప్పుడు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ జీఓల విషయం దాచిపెట్టి ప్రభుత్వంపై నిరాధార నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఓటమితో కేటీఆర్ కు పగలే చుక్కలు కనిపిస్తున్నాయని, వారి పార్టీ ప్రసార సాధనాలు ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుస్తున్నట్టు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాయని, ఇప్పుడు వారి పత్రికలే లేని దానిని కుంభకోణంగా అభివర్ణిస్తే నమ్మే పరిస్థితి లేదన్నారు. అసలు కుంభకోణమో, స్కామో జరిగి ఉంటే వారి పాలనలోనే జరిగి ఉండాలని, పరిశ్రమల యజమానులు హక్కుల పొందాలంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం కట్టాలని జీఓలు ఇచ్చారన్నారు. ఆ భూములు మరొకరి పరమైతే హక్కులు ఎలా కల్పిస్తారో వారికే తెలియాలన్నారు. వారిచ్చిన యాజమాన్య హక్కులు ఉన్నవారికి భూ వినియోగ మార్పిడి చేసుకునే అవకాశం మాత్రమే మేం కల్పించామన్నారు. సీఎం సోదరులు అగ్రిమెంట్లు చేసుకున్నారని నోటికొచ్చినట్లు మాట్లాడారని, వారెవరూ ప్రభుత్వంలో లేరన్నారు. పదేండ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా అభూత కల్పనలు ప్రచారం చేయడం దుర్మార్గం అన్నారు. ఆధారాలేవైనా బయటపెడితే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుందన్నారు. కన్వర్షన్ ఇంపాక్ట్ ఛార్జీల వల్ల రూ.4 వేల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నామన్నారు. యాజమాన్య హక్కులు లేనివారు కన్వర్షన్ కు దరఖాస్తు చేసుకోలేరన్నారు.

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలకు గండికొట్టాలని చూడటమే బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యంగా మారిందన్నారు. ఇండస్ట్రియల్ పాలసీ పై కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.కన్వర్శన్ కు... భూమికి లింక్ పెట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. ఆధారాలు లేకుండా నిరాధారమైన ఆరోపణలు చేయొద్దు అని హితవు పలికారు. హైదరాబాద్ ను గ్లోబల్ సిటీ అవ్వకుండా బీఆర్ఎస్ అడ్డుపడుతుందన్నారు. సొంత భూములు ఉన్న వాళ్ళు కన్వర్శన్ చేసుకోవచ్చు అన్నారు. కేటీఆర్ గాలి మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఫ్రీ హోల్డ్, లీజ్ ల్యాండ్ మధ్య పొంతన లేకుండా కేటీఆర్ మాట్లాడారన్నారు.

## కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు

- **స్థానిక ఎన్నికల్లో లబ్ధికోసమే చిల్లర యత్నం**
- **నాయకులు దాచారం కనకయ్య**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**



ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈకార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ ఆమోదం తెలుపడంతో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తున్నాయనీ మండల బి అర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలను ఖండిస్తున్నట్టు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కట్టడి చేసేందుకు, రాజకీయ క్షేత్రంలో కేటీఆర్‌ను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. పాలనచేతగా సంక్షేమ పథకాలు అమలు చేయలేక హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతున్నా, ఎన్నికల ముందు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈరేస్‌పై విచారణ పేరుతో ప్రభుత్వం కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రె స్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు ప్రభుత్వం పూనుకున్నదని మండిపడ్డారు. విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని చెప్పారు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని కేటీఆర్ ప్రపంచ వ్యాప్తం చేశారని గుర్తుచేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా హామీలు అమలయ్యే వరకు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.కేటీఆర్ కు బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామని తేల్చి చెప్పారు.



గంగాపూర్ గ్రామానికి చెందిన ఫోటో జర్నలిస్ట్ ఎర్ర నర్సయ్య భార్య, Anm ఎర్ర సునీత ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పరామర్శించిన ప్రగాఢ సానుభూతి ని తెలియజేసి కుటుంబం లో ఉద్యోగం వచ్చేల కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హరీష్ రావు భరోసానిచ్చారు.

# ఐబొమ్మ రవిపై ఐదు కేసులు

స్పష్టత కోసం ప్రశ్నిస్తున్నారు.

**సినీ దర్శకుల ఫిర్యాదులు**

తమ కష్టానికి, పెట్టుబడులకు నష్టం వాటిల్లిందని అనేక మంది సినీ నిర్మాతలు, దర్శకులు పోలీసుల వద్ద ఫిర్యాదులు చేయడంతో రవిపై పలు కేసులు నమోదైనట్లు సమాచారం. కొత్తగా రిలీజైన చిత్రాలు గంటల వ్యవధిలోనే పైరసీ కావడం, ఇందులో అతడి ప్లాట్‌ఫారమ్‌లు ఉపయోగపడటం ఈ కేసుల తీవ్రతను మరింత పెంచింది.

**5 రోజుల కస్టడీ – రెండో రోజు కీలక ప్రశ్నలు**

కోర్టు అనుమతితో ఐబొమ్మ రవిని పోలీసులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఈ కస్టడీ రెండో రోజు, సైబర్ క్రైమ్ అధికారులు అతడిని మరోసారి తమ అదుపులోకి తీసుకుని వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు.

పైరసీ వ్యవహారంలో అతడికి సహకరించిన వ్యక్తులు ఎవరు?

అతడి వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందా?

ఒంటరిగా ఈ వ్యవహారాన్ని నడిపాడా?

సాంకేతికంగా సహాయం చేసిన టెక్ టీమ్ ఉందా? అన్న అంశాలపై ప్రశ్నలు వర్షంలా కురుస్తున్నాయి.

**సాంకేతిక విచారణపై ఎక్కువ దృష్టి**

తాజా దర్యాప్తులో రవికి అందిన సాంకేతిక సహకారం, ఉపయోగించిన సర్వర్లు, డొమైన్‌లు, డేటా ట్రాన్స్ఫర్ విధానాలు, సోషల్ మీడియా గ్రూపులు వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పైరసీ కంటెంట్‌ను ఎవరి ద్వారా సేకరించాడు? ఎవరు అప్‌లోడ్ చేశారు? విదేశీ సర్వర్ల సహకారం ఉందా? అన్న విషయాలను లోతుగా ఖననం చేస్తున్నారు.

**ఇంకా మరికొంత మంది అరెస్టులు?**

అతడి సమాధానాల ఆధారంగా త్వరలోనే మరికొంత మంది సహచరులు, టెక్నికల్ టీమ్ సభ్యులు, లీక్ చేసిన మూల వ్యక్తులు గుర్తించబడే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. పైరసీ చైన్‌లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని విచారించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మొత్తం మీద, ఐబొమ్మ రవిపై నమోదైన కేసులు కేవలం వ్యక్తిగత చర్యలకే పరిమితం కాదు. భారీ నెట్టవర్క్ పనిచేస్తున్నదన్న అనుమానంతో పోలీసులు దర్యాప్తు విస్తృతంగా కొనసాగిస్తూ, రాబోయే రోజుల్లో ఈ కేసుకు సంబంధించి మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రావచ్చని భావిస్తున్నారు.





## హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

- **మావోయిస్టు కేంద్ర కమిటీ సంచలన లేఖ**
- **విజయవాడలో అరెస్ట్ చేసిన తర్వాత కాల్చి చంపారు**
- **ప్రభుత్వ దమనకాండకు ఈ ఘటన నిదర్శనమన్న మావోయిస్టు పార్టీ**

**తెలంగాణ బ్యూరో, సిద్ధిపేట పవర్ :**



ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువ్వర్తి గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, హిడ్మా ఎన్ కౌంటర్ మరోసారి వివాదానికి దారితీసింది. హిడ్మా ఎన్‌కౌంటర్‌పై అధికారులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాలు స్పందిస్తున్న వేళ... మావోయిస్టు కేంద్ర కమిటీ శుక్రవారం ఓ లేఖ విడుదల చేస్తూ సంచలన ఆరోపణలు చేసింది. కేంద్ర కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, హిడ్మాతో పాటు మరికొంతమంది మావోయిస్టులను పోలీసులు అసలు ఎన్‌కౌంటర్‌లో కాకుండా బూటకపు ఆపరేషన్‌లో చంపారని ఆరోపించింది. అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన తమ క్యాడర్‌ను భద్రతా బలగాలు రహస్యంగా అదుపులోకి తీసుకున్నాయని పేర్కొంది. ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నామని చెప్పి వారిని నమ్మబలికిన తర్వాత, ఈస్ట్ గోదావరి-అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దుల్లోని మారేడుమిల్లి అడవులకు తరలించి, చల్లబడి కాల్చిచంపినట్లు కేంద్ర కమిటీ ఆరోపించింది. ఈ ఘటన ప్రభుత్వ దమనకాండకు నిదర్శనమని, వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలని కమిటీ డిమాండ్ చేసింది. అదేవిధంగా ఈ నెల 23వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం పిలుపునిచ్చింది. భద్రతా దళాల అక్రమ హత్యలపై, ఆదివాసీలపై జరుగుతున్న అణచివేతపై ప్రజా సంస్థలు, ప్రజాస్వామ్య వర్గాలు స్పందించాలని కోరింది.హిడ్మా మావోయిస్టు అగ్రశ్రేణి నేతగానే కాకుండా, పలు పెద్ద నక్సల్ దాడులకు ప్రధాన సూత్రధారిగా భద్రతా సంస్థలు భావిస్తున్న నేపథ్యంలో ఈ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు ప్రభుత్వ వర్గాలు ఈ ఆరోపణలపై స్పందించాల్సి ఉంది.

## విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీసే సైన్స్ ఫెయిర్..!

**సిద్ధిపేట పవర్:**

సిద్ధిపేట జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్స్పైర్ మరియు వైజ్ఞానిక ప్రదర్శన 2025 కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా సిద్ధిపేట పట్టణములోని వివిధ ప్రాంతములలోని పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది .ముఖ్యంగా అంబిటస్ పాఠశాలలోని తొమ్మిదవ తరగతి చదువుతున్న జి హర్షిత్ రెడ్డి ప్రదర్శన అందరిని అద్భుతంగా ఆకట్టుకోవడం జరిగింది. ప్రదర్శన ఏమీ అని అడగగా ఫైర్ ఫైటింగ్ రోబోటింగ్. దీని వల్ల ఉపయోగాలు మనుషులకు సాధ్యం కానీ ,వెళ్లలేని కఠినమైన ప్రదేశాల్లోకి, ఈ రోబోట్లను పంపి రిమోట్ల ద్వారా కంట్రోల్ చేయడం జరుగుతుందని చాలా చక్కగా వివరించడం జరిగింది. ఇంత చిన్న వయసులో అంత గొప్ప ఆలోచన రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేయడం జరిగింది. ఈ ఇన్స్పైర్ మరియు వైజ్ఞానిక ప్రదర్శన లో" ఫైర్ ఫైటింగ్ రోబోట్" ప్రదర్శన సిద్ధిపేట పట్టణం నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏకైక పాఠశాల అంబిటస్. అంబిటస్ పాఠశాలలోని విద్యార్థులు విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎప్పుడూ మా పాఠశాల ముందు ఉంటుందని,వైజ్ఞానిక ప్రదర్శన అనగా విద్యార్థుల సృజనాత్మకతను పరిశోధన ఆసక్తిని ఎప్పటికప్పుడు పరిశీలించి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, వారిని భవిష్యత్ శాస్త్రవేత్తలుగా మలచడంలో ప్రోత్సాహం అందిస్తామని అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి, శ్రీ ఎడ్ల జ్యోతి,శ్రీనివాస్ రెడ్డి గారు చెప్పడం జరిగింది. రాష్ట్రస్థాయికి ఎంపిక కావడానికి కారణమైన ఉపాధ్యాయులను ,వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన హర్షిత్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించడం జరిగింది






## స్థానిక సంస్థల గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**కొమురవెల్లి, నవంబర్ 21 (సిద్దిపేట పవర్)**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రతీ ఒక్క కార్యకర్తపై ఉంది అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు..ఈ సందర్భంగా ఆయన కొమురవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు..గ్రామాలను అభివృద్ధి చేసింది బి.ఆర్.ఎస్ పార్టీ యే నని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉంది అని ఆయన తెలిపారు..అదే గ్రామాల్లో చనిపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు..కార్యక్రమంలో కొమురవెల్లి మండల అధ్యక్షులు గీస బిక్షపతి, మాజీ ఎంపీపీ తలారి కీర్తన కిషన్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, బొంగు రాజేందర్ రెడ్డి, ఏర్పుల మహేష్ తదితరులు పాల్గొన్నారు..

## అనాథ అవ్వాకు ఆరికేపూడి అండ

- **ఇళ్లు నిర్మించి గృహ ప్రవేశం చేసి బంధువుల మధ్య గృహ ప్రవేశం**
- **ఆనందం వ్యక్తం చేసిన ఆరికేపూడి చైర్మన్ రఘు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ అనాథ అమ్మకు ఆరికేపూడి సేవా ట్రస్ట్ అండగా నిలిచి ఇళ్లు నిర్మించి మానవత్వం చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన సింపతి బాలమ్మ, భర్త చంద్రయ్య దంపతులు, వీరు తమకున్న పెంకుటిళ్లలో జీవనం సాగించారు. పదమూడు ఏళ్ల క్రితం భర్త చంద్రయ్య మృతి చెందడంతో భార్య అనాథగా జీవనం సాగిస్తుంది. ఉన్న ఇళ్లు కూలిపోవడంతో గత ఎనిమిదేళ్లుగా మరుగుదొడ్డిలోనే నివాసం ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆరికేపూడి సేవా ట్రస్ట్ చైర్మన్ డా. రఘు మూడు నెలల క్రితం స్పందించి గ్రామానికి చేరుకుని బాలమ్మ పరిస్థితిని తెలుసుకున్నారు. బాలమ్మకు గూడు కల్పించాలని నిర్ణయం తీసుకుని వెంటనే ఇళ్లు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఇళ్లు నిర్మాణం పూర్తి కావడంతో శుక్రవారం అనాథ అవ్వ బాలమ్మ,రూరల్ మీడియా వ్యవస్థాపకులు శ్యాం మేహన్ తో కలిసి గృహ ప్రవేశం చేశారు. ఇళ్లు నిర్మాణం పూర్తి అయి ఇంట్లోకి పోవడంతో బాలమ్మ సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆరికేపూడి సేవా ట్రస్ట్ చైర్మన్ డా. రఘు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఎంతోమంది పేదలు బాలమ్మలాంటి బతుకులు బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి అనాధ నిరుపేదల కోసం ఆరికేపూడి సేవా ట్రస్ట్ అండగా నిలుస్తుందని వివరించారు. బాలమ్మ పరిస్థితి తెలుసుకొని వెంటనే గ్రామానికి చేరుకొని బాలమ్మ ఇంటి నిర్మాణానికి కంకణం కట్టుకొని ఇల్లు పూర్తి చేసి బంధువుల మధ్య గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడమే ఆరికేపూడి సేవా ట్రస్ట్ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. బాలమ్మకు సారి పెట్టి ఇంటిని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. బాలమ్మకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. సహకరించిన తిపర్తి రామ్ ప్రసాదు, శ్రీ పాద శివరాం ప్రసాదు, పావులూరి సాయి శశాంక్, అంకం నిర్మల, అంకెనగారి పాండు గౌడ్, మేస్త్రి నరసింహంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి నవంబర్21.**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘ సభ్యులు ముదిరాజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ముదిరాజ్ సంఘ సభ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులను ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నాయి తప్ప ముదిరాజుల జీవన ప్రమాణానికి ఎటువంటి రిజర్వేషన్లు ఇవ్వకపోవడం వల్ల ముదిరాజులు రిజర్వేషన్ల పరంగా అన్ని విధాలుగా నష్టపోతున్నామని కానుగంటి శ్రీనివాస్ అన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ముదిరాజులను బీసీ డీ నుండి బీసీ ఏకు మారుస్తానని మాట ఇచ్చి తప్పినాడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక కూడా మా ముదిరాజులు బ్రతుకులు మారుతాయి అని అనుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ముదిరాజులను కేవలం ఓట్ల కోసం మాత్రమే వాడుకుంటున్నాయి తప్ప ఎలాంటి రిజర్వేషన్ కల్పించకపోవడం వల్ల ముదిరాజులు తీవ్రంగా నష్టపోతున్నారని కానుగంటి శ్రీనివాస్ ద్వజమెత్తారు ఇకనైనా



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముదిరాజుల పట్ల కక్షపూరిత వైఖరి మాని ముదిరాజుల వాటా మీరు ఇచ్చే బిక్ష కాదు అది మా హక్కు అనే నినాదంతో ముందు ముందు ఇంకా మా ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించడం జరిగింది ముదిరాజులు అంటే మత్స్యకార వ్యాపారం చేసుకుని బ్రతకాలి అనే దుర్భిని మాని ముదిరాజుల రిజర్వేషన్లు వెంటనే అమలు చేయవలసిందిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మిరుదొడ్డి మండల ముదిరాజ్ సంఘ నాయకులు డిమాండ్ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి ముదిరాజ్ సంఘ అధ్యక్షులు రంగనమైన రాజు కానుగంటి శ్రీనివాస్ రంగనమైన రామకృష్ణ తుమ్మల ప్రశాంత్ తుమ్మల బాలరాజు మిరుదొడ్డి మండలం ముదిరాజ్ సంఘ సభ్యులు బోయిని చంద్రకుమార్ గొట్టం రవి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# శిశు సంరక్షణపై మరింత అవగాహన పెంచుకోవాలి..

- **గాంధీలో న్యూ బోర్న్ బేబీ వారోత్సవాలు..**

**సికింద్రాబాద్, నవంబర్ 21 ( సిద్దిపేట పవర్ ) :**

నవ జాత శిశు సంరక్షణపై తల్లులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. గాంధీ మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రి (ఎంసీహెచ్) లో గైనకాలజీ, పిడియాట్రిక్ విభాగాల సంయుక్త నేతృత్వంలో న్యూబోర్న్ బేబీ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పలు అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, పిడియాట్రిక్, గైనకాలజీ హెచ్ఓడీలు డా.వాసుదేవ్, డా.శోభలు మాట్లాడుతూ.. తల్లి స్పర్శతోనే శిశువుల ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. శిశువు పుట్టిన మొదటి 28 రోజులు క్లిష్టమైనవని, ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. శిశువును హత్తుకుని వెచ్చగా ఉంచడం, శ్వాస సరిగా తీసుకునేలా చేయడం, క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, ఇన్ఫెక్షన్లు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, ముర్రుపాలు శిశువుకు ఔషధంలా పనిచేస్తాయని అన్నారు. నవజాత శిశువుల్లో తరుచు వచ్చే అనారోగ్య లక్షణాలు వివరించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తల్లులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. శిశువులకు ఏదేని అనారోగ్యం కలిగినట్లయితే సొంత వైద్యం చేయకుండా, వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పిడియాట్రిక్ వైద్యులు జేవన్ జార్జ్, అజయ్‌మోహన్, అఖిల, జనార్ధన్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు సుధార్‌సింగ్, కళ్యాణచక్రవర్తి, యోగేందర్, సౌమ్య, మౌనిక, హసితల తోపాటు వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.




# చెకుముకి పోటీలో సేయింట్ విన్సెంట్ పాఠశాల విద్యార్థుల కు మండల స్థాయిలో ప్రథమ బహుమతి

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జనవిజ్ఞానవేదికవారిఆధ్వర్యంలోచెకుముకి సైన్స్ సంబరాలను జగదేవపూర్ మండలంలోని స్థానిక గర్ల్స్ హైస్కూల్లో మండల స్థాయి పోటీలను నిర్వహించడమైనది.ఈ సంబరాల్లో మండలం లోని 14 పాఠశాల విద్యార్థిని విద్యార్థులు హాజరైనారు. అదే విధంగా పోటీలో సెయింట్ విన్సెంట్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం పొందినారు. వారికి యం ఈ ఓ సైదులు చేతుల మీదుగా ప్రథమ బహుమతిని అంద జేశారు.వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవరెండ్ సిస్టర్ జానెట్ అభినందించినారు.ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు కరుణాకర్ సిస్టర్ అలీన ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారులైన గంగపుత్రులకు 70% కేటాయించాలి

- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ కి గంగపుత్రుల వినతి పత్రం అందజేత.**

**సిద్దిపేట్ నవంబర్ 21 న్యూస్.**





సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నాడు గంగపుత్రుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి, ఫిషరీస్ డిపార్ట్మెంట్ కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిద్దిపేట, చిన్నకోడూర్, నారాయణరావుపేట్ ,గంగపుత్రుల సంఘం అధ్యక్షులు రాజయ్య, లక్ష్మణ్ ,ఎల్లయ్య మాట్లాడుతూ బెస్త ,గుండ్ల ,గంగపుత్రులు సనాతన సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రులం.తరతరాలుగా యుగయుగాలుగా చేపల వేట, అమ్మకం కులవృత్తిగా కలిగిన వాళ్ళం.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతరామన్ కమీషన్ గ్రామస్థాయి పర్యటనల ద్వారా కులవృత్తులను , వారి జీవన విధానాన్ని, స్థితిగతులను పూర్తిగా వివరించారు. ఈ యొక్క రిపోర్ట్ లో కూడా స్పష్టంగా చేపల వేట,అమ్మకం మాత్రమే బెస్త,గూండ్ల గంగపుత్రుల కులవృత్తి అని పేర్కొన్నారు, ఎస్టీలలో చేర్చాలని సిఫారసు కూడా చేసారు. అది ఇప్పుడు పార్లమెంటు లో పెండింగ్లో ఉంది.1964 లో సొసైటీ యాక్ట్ వచ్చినపపుడు జీవో నెంబర్ 98/1964 లో కొన్ని చోట్ల గంగపుత్రుల ఉనికి పూర్తిగా లేని ప్రాంతాల్లో చేపల వేట వృత్తిలోకి జీవనోపాధి నిమిత్తం కొన్ని రకాల బీసీ కులాలు, ఎస్సీ,ఎస్టీ మైనారిటీ కులాలు వచ్చాయి.బెస్త గూండ్ల గంగపుత్రులు కాకుండా ఏ ఇతర బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీ కులాలు కూడా మత్స్యకారులుగా చెప్పుకోవడం లేదు, కానీ ఒకే ఒక్క కులం అనంతరామన్ కమీషన్ రిపోర్ట్ లో స్పష్టంగా వారి కులవృత్తి తోటపని, కాపలాదారులు, వ్యవసాయం వారి కుల వృతులు అని పేర్కొన్నప్పటికీ అలాగే కొన్ని జిల్లాలో కల్లుగీత కార్మికులు గా కల్లు కూడా గీస్తారు. ఎక్కడ గంగపుత్రుల పూర్తి ఉనికి లేని ప్రాంతాల్లో చేపలు పట్టి బ్రతుకుతున్నంత మాత్రానా వారి కులం మొత్తం మత్స్యకార వృత్తి కులంగా చెప్పుకుంటూ ప్రభుత్వాలను ఓటు బ్యాంకు చూపించుకుని రాజకీయంగా ప్రభావితం చేస్తూ వారికి ఎక్సెస్ జీవోలను తెప్పించుకుంటూ గత 20 ఏళ్ళుగా సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రుల కులవృత్తి దోపిడీకి పాల్పడుతూ దాడులకు తెగబడుతూ గంగపుత్రుల జీవనోపాధిని మరియు ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలను, వాహనాలను సంక్షేమ పథకాలను కొల్లగొడుతూ తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తున్నారు. కావున గత పదేళ్ళలో గంగపుత్రులను బెదిరించి, భయభ్రాంతులకు గురి చేసి, దాడులు చేసి, ప్రభుత్వం ద్వారా అనుకూల జీవోలు తెప్పించుకుని, ఆ జీవోలను అడ్డుపెట్టుకుని, అనేక కుల వృత్తులు చేసుకుంటూ కల్లుగీత కార్మికులు గా ఉన్నారు. బ్రతుకు దెరువుకు కోసం మత్స్యకార వృత్తిలోకి వచ్చి నేడు పూర్తి స్థాయి మత్స్యకారులు చెప్పుకొని జనాభా ఎక్కువ గా ఉంది అని వారికి అన్ని రాజకీయ పార్టీలు ఊడిగం చేస్తున్నాయి. నాడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అలాగే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారికీ రాజకీయ అండదండలు కల్పిస్తుంది. వారు న్యాయ స్థానాలలో కేసులను వేస్తూ మత్స్యశాఖలో విలయ తాండవం చేస్తున్నారు. 1964 నుండి 2014 వరకు అనగా 50 సంవత్సరాల పాటు ఉన్నటువంటి మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు కేవలం 2800 మాత్రమే. ఐతే 2014 నుండి 2024 వరకు 6300 సొసైటీలకు పెంచుకున్నారు. నూతనంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలను చేసుకుని సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రుల కులవృత్తిని దోపిడి చేయడం ద్వారా జీవనోపాధిని దెబ్బ తీశారు.ఇంకా కూడా రాజకీయ అండదండలతో పూర్తిస్థాయి మత్స్యకారులుగా చూపించుకునే ప్రయత్నంలో వారికనుకూలంగా హైకోర్టును తప్పుదారి పట్టించి ఎక్స్పర్ట్ కమిటీ రిపోర్ట్ ద్వారా మత్స్యశాఖ నుండి మెమోలను తెప్పించుకుని పూర్తిగా సంప్రదాయ మత్స్యకారులైన బెస్త గూండ్ల గంగపుత్రులు పొట్టకొడుతున్నారు.సొసైటీ యాక్ట్ వచ్చినప్పటి నుండి ప్రభుత్వానికి శిస్తు కడుతూ వృత్తిని కాపాడుకుంటూ ఉపాధి పొందుతున్నటువంటి మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలలోకి అక్రమంగా చొరబడడానికి ప్రయత్నం చేస్తున్నారు.కావున ఎక్స్పర్ట్ కమిటీ పూర్తిస్థాయిలో సమస్యలున్నటువంటి గ్రామాల పర్యటన చేసి అసలు హక్కుదారులైన సంప్రదాయ మత్స్యకారులైన బెస్త ,గూండ్ల, వారికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకోని వచ్చి వృత్తి దోపిడీని అరికట్టాలి.1964 నుండి 2800 సొసైటీలు ఉంటే 2014 నుండి 2024 వరకు ఏర్పడిన 3500 నూతన సొసైటీలను పూర్తి స్థాయిలో ఎంక్వయిరీ చేసి వృత్తి నైపుణ్యత లేని సొసైటీలను, సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుచున్నాము.రాజకీయ అండదండలతో ఇతర కులస్థులు సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రుల కులవృత్తిని దోపిడి చేస్తున్నందున ఇప్పటి వరకు మిగిలి ఉన్నటువంటి బెస్త, గూండ్ల గంగపుత్రుల సొసైటీలలోకి ఇతరులు చొరబడకుండా, ఇప్పటికే అక్రమంగా గంగపుత్రుల సొసైటీలలోకి చొరబడిన ఇతర కులస్తులు.నూతనంగా మత్స్యకార కులం కాని వారిని సొసైటీలలోకి చేర్చకండి. అదే విధంగా ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చి , ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి సంప్రదాయ మత్స్యకారులను ఆదుకోవాలని కోరుచున్నాము. అదే రక్షణ చట్టంలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరే విధంగా 70% వాటా కేటాయించాలని కోరుకుంటున్నాము. ఇప్పటివరకు రాష్ట్రంలో ప్రభుత్వ చేపల మార్కెట్ లేనందున రాష్ట్రరాజధాని హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో హోల్ సేల్ చేపల మార్కెట్లు, హైదరాబాద్ వ్యాప్తంగా అన్ని మునిసిపాలటీలు, మండల, డివిజన్ కేంద్రాల్లో రిటైల్ చేపల మార్కెట్ లు ఏర్పాటు చేసి అందులో సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రులకు 70% షాపులను కేటాయించి ఆదుకోవాలి. ఉచిత చేపపిల్లల పంపిణీ వృత్తికి సంబంధం లేని వ్యాపారులకు ఇవ్వడం ద్వారా , ఎన్నో అవకతవకలు, నాణ్యమైన సీడ్ అందక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.కావున ఉచిత చేపపిల్లల పంపిణీ బదులుగా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల బ్యాంక్ అకౌంట్ లో నగదు జామచేసి సంప్రదాయ మత్స్యకారులమైన గంగపుత్రుల కుల వృత్తికి రక్షణ కల్పించాలి. చేప విత్తన కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి సంప్రదాయ మత్స్యకారులకు ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలి.రాష్ట్రంలో ఉత్పత్తి జరుగుతున్న చేపల వ్యాపార రంగంలోకి ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక రుణాలు ఇవ్వడం ద్వారా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించడం ద్వారా మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలి.మత్స్యకారులకు సంబంధించిన మత్స్య ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ ను శాశ్వతంగా సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రులకు మాత్రమే ఇచ్చేలా చట్టం చేసి, జిల్లాల చైర్మన్ లో 70% చైర్మన్ లను మత్స్యకారులైన గంగపుత్రులకే ఇవ్వాలి. చేపల వేట సమయంలో చెరువుల కాపలా సమయంలో, చేపలు పట్టిన తర్వాత రవాణా చేసే సమయంలో, చేపలు అమ్మే సమయంలో కొంతమంది వచ్చి వినరాని, అనరాని భాషలో దూషణలకు దిగడం, దాడులు చేయడం జరుగుతుంది. అటువంటి సమయంలో ఎస్సీ ఎస్టీలకు ఉన్న మాదిరిగా మత్స్యకారులకు కూడా రక్షణ చట్టం చేయాలని కోరుచున్నాము.చేపల వేట సమయంలో అనుకోని సందర్భాలలో, ప్రమాద వశాత్తు నీటిలో పడి మునిగి చనిపోవడం, గళ్ళంతవడం జరుగుతుంది. దాని వలన మత్స్యకారుని కుటుంబాలు రోడ్డున పడుతున్నందున, లైఫ్ జాకెట్లు తెప్పల స్థానంలో నూతన చేపల వేటకు అనుకూలమైన బోట్లు ఇవ్వాలని కోరుచున్నాము.ఈ మధ్య కాలంలో ప్రభుత్వం నుండి పంపిణీ చేసినటువంటి వాహనాలను మరియు చేపల వంటకాల తయారీ శిక్షణ, చేపల సంబంధ ఇతర అభివృద్ధి అంశాలలో మత్స్యకారులకు కాకుండా అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం వలన మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. కావున కేవలం సంప్రదాయ మత్స్యకారులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని భారీ నీటి పారుదల ప్రాజెక్టులలో కూడా ఇదే విధంగా లైసెన్స్ విధానం రూపొందించాలని కోరుచున్నాము. మత్స్యకారులకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఎలాంటి కార్యక్రమం ఐన ముందు సనాతన సంప్రదాయ మత్స్యకారులైన గంగపుత్రుల ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరుచున్నాము.పైన పేర్కొన్న అన్ని సమస్యలను, అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించి ప్రభుత్వం నుండి మాకు సరైన రీతిలో న్యాయం జరిగేలా చూడాలని తమరి ఘనతను కోరుచున్నాము అని అన్నారు ఈ కార్యక్రమంలో గుడిసె ప్రభు గంగపుత్ర , పల్లె నరసింహులు,సిద్దిపేట, చిన్నకోడూరు, నారాయణరావుపేట గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# చిరు ఉద్యోగుల పెద్ద మనసు..

- **ప్రతి నెల వేతనం నుంచి కొంత భాగం సేవ పనులకు...**
- **గాంధీ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

**సికింద్రాబాద్, నవంబర్ 21 ( సిద్దిపేట పవర్ ) :**

ఆర్ఎన్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఉద్యోగులు కృష్ణజ్యోతి, కీర్తిల ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి ఎంసీహెచ్ విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు, గర్భిణీలకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక సేవలో భాగంగా ఉద్యోగులు తమ వేతనంలో కొంతభాగాన్ని ప్రతి నెల ఇలాంటి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. షాలోమ్ రివైవల్ వర్షిప్ సెంటర్ ప్రసాద్ షాలోమ్ తమకు ప్రేరణ అని చెప్పారు. కృష్ణజ్యోతి, కీర్తిలను వైద్యులు ఈసందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు వాసుదేవ్, జేవన్ జార్జ్, అజయ్‌మోహన్, శోభ, ఆర్ఎంఓలు శేషాద్రి, యోగేశ్వర్, కళ్యాణ్, సుధార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.





# ఇంద్రానగర్ పాఠశాల ఆదర్శం మరిన్ని వసతులు కల్పిస్తాం

- **మాజీమంత్రి స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట పవర్ సిద్దిపేట నవంబర్ 21:**

సిద్దిపేట ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల లో కంప్యూటర్ ల్యాబ్ ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు.నిజానికి ఇందిరానగర్ పాఠశాల అంటే ఒక ఇష్టమైన పాఠశాల, ఒక ఇష్టమైన ఉపాధ్యాయులు, ఉత్సాహం గా ఉండే విద్యార్థులు. నేనెప్పుడూ ఈ స్కూల్ కి వచ్చినా ఒక కొత్త శక్తి తో వెళ్తానీ అన్నారు.ఒక గొప్ప భావన.ఇంత బాగా చేసినందుకు, ఇంత బాగా ప్రోత్సహిస్తున్నందుకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. సిద్దిపేటకు ఉపాధ్యాయులు రావాలని కొందరు అనుకుంటారు, కానీ ఇందిరానగర్ రావాలంటే చాలామంది భయపడతారు కానీ వచ్చిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు అభినందనలు అంటూ.ఇష్టంతో పనిచేస్తున్నారనీ తెలిపారు కాబట్టి ఇంతటి ఫలితాలు.నేను దత్తత తీసుకోవచ్చు, కానీ ఆ కృషి మా ప్రధానోపాధ్యాయులది, మా ఉపాధ్యాయులది, మా చిన్నారులకే దక్కుతుందనీ అన్నారు.నేను సహకారం మాత్రమే చేయగలుగుతాననీ, కానీ అది మన ఉపాధ్యాయుల పట్టుదలగల కృషి తోనే ఏదైనా సాధ్యం. నిజంగా ఆ పిల్లలు, తల్లిదండ్రుల పక్షాన మా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు . ఈ రాష్ట్రంలో టాప్ 10 స్కూల్స్‌లో ఇంద్రానగర్ టాప్ 3లో ఉంది. ఇంకొంచెం ఫెసిలిటీ ఇవ్వగలిగితే ఇంకా ముందుకు వెళ్తాం అని.ల్యాబ్ అండ్ డైనింగ్ హల్ కావాలని అడిగారు అవి నెలరోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తానని తెలిపారు అవసరమైతే నా సొంత డబ్బులతో చేస్తా. మీకు లోటు మాత్రం రానియ్యను.నేను ఏది చేయాలనుకున్నా కూడా ఫస్ట్ చేయగలిగింది ఇందిరానగర్ స్కూలుకు మాత్రమే అని అన్నారు. సిద్దిపేటలో ఏ జిల్లాలో కూడా స్టీల్ బ్యాంక్స్ పెట్టాము. ఫైనాన్స్ కమిషన్ కూడా స్టీల్ బ్యాంకును ప్రశంసించిందనీ. మన పిల్లలకు హాస్టల్ లాగ , నేను బర్రెలకూ, గొర్రెలకూ కూడా హాస్టల్ కట్టించాననీ .ఢిల్లీ నుండి వచ్చి చూసి వెళ్లారు.సిద్దిపేటలో ఫార్మసీ కాలేజ్ కట్టించాము. దానికి మన ఎగ్జిబిషన్ సొసైటీ వాళ్ల సహకరం తో నా సొంత డబ్బు లతో ఆరు ఎకరాల స్థలం కొని బి ఫార్మసీ కళాశాల కట్టించాను.సిద్దిపేటలో రెండు మెడికల్ కాలేజీలు, రెండు నర్సింగ్ కాలేజీలు, రెండు పారామెడికల్ కాలేజీలు, నాలుగు పాలిటెక్నిక్ కాలేజీలు,BSc అగ్రికల్చర్ ఇలా అన్ని విద్యాలయాలు.మన ల్యాబ్ ఏది పెట్టించామో అది మన ఇంజనీరింగ్ పిల్లలతో పోటీ పడేలాగా ఏర్పాటు చేసాం అది ప్రారంభించడం సంతోషంగా ఉందనీ గుర్తు చేశారు.ఇక్కడ విద్యార్థులు విద్యతో పాటు జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. ఆల్ రౌండ్ గా సిద్దిపేటలో మన ఇంద్రానగర్ అన్నీ రంగాల్లో టాప్‌లో ఉంది.Z.P.H.S ఇంద్రానగర్ నుండి మహమ్మద్ అనాస్ నేషనల్ ఫుట్బాల్ ఛాంపియన్‌షిప్‌లో కెప్టెన్‌గా ఉండడం చాలా గర్వకారణమని.ప్రతి మ్యాచ్లో రన్నర్ అయ్యాడు, ప్రతి మ్యాచ్లో గోల్ కొట్టి ప్రతిష్ట పెంచాడు. మన స్కూల్ విద్యార్థి ఇంద్రానగర్ విద్యార్థి.ఈ సంవత్సరం స్కాలర్‌షిప్‌లో మొత్తం 45 మందికి సీట్లు వస్తే, సిద్దిపేట నుండి కేవలం ఇంద్రానగర్ నుండే 16 మందికి సీట్లు వచ్చాయనీ అన్నారు.అంటే దాని ముందు టీచర్ విద్యార్థుల డెడికేషన్ ఉంది.ఆటో డ్రైవర్ పిల్లలు, ఆటో కార్మికుల పిల్లలు, కూలీల పిల్లలు టాప్‌లో ఉండడం మాకు గర్వకారణం.260 మంది టెన్త్ స్టూడెంట్స్ ఉన్నారు.ఈ సంవత్సరం కూడా 600 మార్కుల్లో 550 పైగా సాధించిన వారు 16 మంది ఉన్నారు.550 పైగా ఎంతమంది తెచ్చుకుంటే అందరికీ నేను క్యాష్ ప్రైజ్ ఇస్తాను.క్యాష్ ప్రైజ్ తో పాటు సిల్వర్ మెడల్ ఇస్తాను.టీవీలు చూడొద్దు, ఫోన్ ఓన్లీ వాడొద్దు, ఫంక్షన్స్‌కి వెళ్లొద్దు.చదువులో ఏకాగ్రత సాధించి భవిష్యత్తుకి అడుగులు వేయలని సూచించారు.త్వరలోనే మీ అమ్మానాన్నలకు ఉత్తరం రాస్తాను.భవిష్యత్తులో ఇకనుండి డాక్టర్, ఇంజినీర్‌లుగా ప్రముఖ రంగాల్లో ఉండేవాళ్లను చూడాలనీ.ముఖ్యమంత్రి ఆఫీస్ నుండి కూడా రికమండేషన్స్ రావడం ఇదే ఇంద్రానగర్ స్కూల్ గొప్పదనం. ఒక యోగా ఇన్స్ట్రక్టర్‌ను కూడా ఇక్కడ కేటాయిస్తాం. భవిష్యత్ లో ఇంకా ఏమి కావాలన్నా నేను అన్ని విధాలా అండగా ఉంటాననీ. వాళ్లతో మాట్లాడుతూ, మీకు ఫారిన్ లాంగ్వేజెస్ కూడా మళ్లీ రీ-ఇన్‌స్టార్ట్ చేసి ప్రారంభిస్తాము. ఇంకా ఏదైనా చేయగలిగితే అన్ని విధాలుగా సహకారం అందిస్తామని.ఎవరైతే మంచిగా చదువుకుంటారో, ఎవరైతే స్కూల్‌కి సెలవులు పెట్టకుండా రెగ్యులర్‌గా వస్తారో —— వారికి ప్రత్యేకంగా ఒక బస్సు పెడతాననీ. అందులో నుంచి కొందరిని అసెంబ్లీకి తీసుకెళ్లి చూపిస్తాననీ.నేనెప్పుడూ ఇంద్రానగర్ స్కూల్‌కి వచ్చినా ఒక కొత్త ఎనర్జీతోనే తిరిగి వెళ్తాననీ అన్నారు







# ఇసుక మాఫియా పై చర్య తీసుకోవాలి...

- **ఇసుక రవాణానను తక్షణమే నిలిపివేయాలి...**
- **మెదక్ నుండి హైదరాబాద్ కు టిప్పర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక రవాణా పై చర్యలు తీసుకోవాలి.**
- **లేనిచో బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తాం...**
- **మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఫిర్యాదు....**
- **మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి....**

**మెదక్ (సిద్దిపేట పవర్) ప్రతినిధి**



మెదక్ నియోజవర్గంలో వివిధ ప్రాంతాల నుండి మరియు మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగు నుండి గత నెల రోజులుగా రాత్రిపగలు హిటాచి సహాయంతో టిప్పర్ల ద్వారా హైదరాబాద్ జహీరాబాద్,బీదర్ నగరాలకు ఇసుక అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు,వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ,మెదక్ పట్టణ , మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... అధికార పార్టీ నాయకుల అండదండలతో మెదక్ ప్రాంతం నుండి హైదరాబాద్, జహీరాబాద్ బీదర్ నగరాలకు సంగాయిగూడ తండా హల్దీ వాగు నుండి హిటాచి సహాయంతో గత నెల రోజులగా టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అన్నారు. పోలీసులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారు అని ప్రశ్నిచారు. ప్రతిపక్ష నాయకుల పైన కేసులు పెట్టడం కేసులు పెట్టడం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు కానీ ఈ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు దొరకని ఇసుక అక్రమంగా హైదరాబాద్ కు ఎలా తరలిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే అక్రమంగా ఇసుక దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి, లేనిచో బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు శుక్రవారం పాత ఎస్పీ కార్యాలయం దగ్గర వెహికిలు చెకింగ్ నిర్వహించారు, సాధారణ ప్రయాణికుల కార్ లు , ద్విచక్ర వాహనాలు ఆపారు కానీ ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మాత్రమే ఆపలేరని అన్నారు. మెదక్ నుండి ఇలా అక్రమంగా ఇసుక తరలిపోతే మెదక్ ప్రాంత ప్రజలకు తీవ్రత నష్టం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో వెంటనే మెదక్ ఎస్పీ ,కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.లేనిచో బిఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు విశ్వం, భీమరి.కిషోర్ ఆర్కే.శ్రీనివాస్, మాయ. మల్లేశం, మెదక్ మండల మాజీ వైస్ ఎంపీపీ మార్గం. ఆంజనేయులు, నాయకులు కొత్తపల్లి కిష్టయ్య,గట్టయ్య, యాదగిరి, లింగా రెడ్డి, ప్రభాకర్, జుబెర్ అహ్మద్, మేకల సాయిలు,యామి రెడ్డి,సాప. సాయిలు, స్వామి నాయక్, రంజిత్, లడ్డు, చంద్ పాషా తదితరులు ఉన్నారు...

# ఆంజనేయ స్వామి ఆశీస్సులతో అందరూ బాగుండాలి....

- **ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం .**
- **పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి.**

**మెదక్ (సిద్దిపేట పవర్) ప్రతినిధి**



మెదక్ పట్టణంలోని ద్వారకా నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండి రైతులు సభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రభు రెడ్డి పద్మ దేవేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్ సులోచన ప్రభు రెడ్డి,ఆరేళ్ల గాయత్రి, విశ్వం, భీమరి. కిషోర్, ఆర్కే. శ్రీనివాస్, మాయ. మల్లేశం, నాయకులు లింగా రెడ్డి,జుబెర్ అహ్మద్,కిష్టయ్య, సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి, మార్గం. ఆంజనేయులు,యామి రెడ్డి, మేకల. సాయిలు,స్వామి నాయక్, రంజిత్,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# మానసికంగా శరీరకంగా క్రీడాలు ఎంతో ఉపయోగపడతాయి...

- **డి.ఎస్.పి ప్రసన్న కుమార్...**
- **స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్...**

**మెదక్ (సిద్దిపేట పవర్) ప్రతినిధి**






ఖేలో ఇండియా అస్మిత బాలికల అండర్ 14 మరియు 16 మెదక్ జిల్లా స్థాయి పోటీలు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు స్థానిక అథ్లెటిక్స్ స్టేడియం మెదక్ నందు ఉదయము 10 గంటల రన్స్ త్రో జంప్ మూడువిభాగాల్లో పోటీలు మొదలయ్యాయి సుమారుగా జిల్లా నలుమూల నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.ఎస్.పి ప్రసన్న కుమార్ క్రీడాకారులు ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని మానసికంగా శారీరకంగా క్రీడలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ గా నాగరాజు పాల్గొన్నారుహవేలీ ఘన్పూర్ హెడ్మాస్టర్ కరుణాకర్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్ రెడ్డి వెంకట్రాంరెడ్డి టి పి టి ఎఫ్ జిల్లా కార్యదర్శి మరియు పీడీలు శ్వేత సరోజ సత్యనారాయణ రవి పూర్ణ క్రీడాకారులు మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు..

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒక వ్యక్తికి 02 రోజులు జైలు శిక్ష

- **మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందికి రూ 1,60,000 జరిమానా**
- **గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజవర్గ ప్రతినిధి నవంబర్ : 21**

గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి సిబ్బందితో గత కొన్ని రోజుల పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 17 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 16 మందికి రూ 1,60,000 జరిమానా, ఒక వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష, విధించారు. రెండు రోజుల జైలు శిక్ష పడిన అతని వివరాలు గూడూరి కనకయ్య తండ్రి బాల్ నర్సయ్య, వయస్సు (45) ఆర్అండ్ఆర్ కాలనీ గజ్వేల్ పట్టణం. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారికి ప్రమాదం, రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల




రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు.